# వాస్తవం

గురువారం 12.03.2026

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## 16 నుంచి ఒంటిపూట బడులు

**హైదరాబాద్, మార్చి 11 :**

రాష్ట్రంలో ఒంటిపూట బడులు మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. వాస్తవానికి మార్చి 15 నుంచే ఒంటిపూట బడులు ప్రారంభంకావాల్సి ఉండగా, అదే రోజు ఆదివారం కావడంతో ఈ సారి మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు షురూ కానున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే బడులు నడుపుతా రు.మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో మధ్యాహ్న భోజనాన్ని అంద జేస్తారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న బడుల్లో మాత్రం మధ్యాహ్నం క్లాసులుంటాయి. ఈ బడులను మధ్యా హ్నం ఒంటి గంట నుంచి సా యంత్రం 5 గంటల వరకు నడుపుతారు. సెంటర్లున్న బడుల్లో తొలుత మధ్యాహ్నం భోజనం అందజేసి ఆ తర్వాత తరగతులు కొనసాగిస్తారు. పది పరీక్షలు ముగిసిన తర్వాత మళ్లీ ఉదయం పూటే ఆయా బడులు నడుస్తాయి.

## సార్లు మార్చింది..కండువాలేనంట

# పార్టీలు కాదంట?




## వారెవ్వా..ఏం తీర్పు..అచ్చం అనుకున్నట్లే ఉందే?

10లో..

కె.ఆర్ ఉన్నమాట

ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేకి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు. ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే.. రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా.. భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.

- దానం ఎమ్మెల్యేగా గెలిచింది కారు గుర్తు మీద..ఎంపీగా పోటీచేసింది హస్తం గుర్తుతో
- అయినా ఆయన పార్టీ మారినట్లు కాదంట..బీఆర్‌ఎస్‌లో ఉన్నట్లే అంట
- కడియం ఎమ్మెల్యేగా గెల్చింది బీఆర్ఎస్ బీఫామ్‌తో..
- ఎంపీ ఎన్నికలో ప్రచారం చేసింది కాంగ్రెస్ కోసం
- అయినా ఆయన పార్టీ మారలేదు..కారు దిగలేదు...

కారు గుర్తు మీద పోటీ చేసి గెలుపొందిన 10 మంది శాసన సభ్యులు తాము ఇంకా కారు దిగలేదు..పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాలను స్పీకర్ విశ్వసించి వారు పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేని కారణంగా వారికి క్లీన్‌చీట్ ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నట్లయింది.ఇరకాటం నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటపడినట్లయింది.

## దానం,కడియంలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే

- వారిద్దరు పార్టీ మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవు
- దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్





**» ఇప్పటివరకూ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

10లో..

## స్పీకర్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం


**మూజువాణి ఓటుతో లోక్‌సభలో తిరస్కరణ**

**అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం**

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపు కోరుతూ విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం లోక్‌సభలో వీగిపోయింది. సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య మూజువాణి ఓటుతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఓటింగ్ అనంతరం సభ వాయిదా పడింది. లోక్‌సభ గురువారం ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశమవుతుంది. నిష్పాక్షికంగా సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా విఫలమయ్యారని ఆరోపిస్తూ విపక్షం ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. గురువారం సభలో ఓం బిర్లా స్పీకర్ స్థానంలో ఆసీనులవుతారు. విపక్ష సభ్యుల ప్రవర్తనపై ఆయన సభలో ఓ ప్రకటన చేయనున్నారు.

**స్పీకర్‌పై విపక్షం విమర్శలు**

పార్లమెంట్‌లో అసమ్మతికి స్థానం తగ్గిపోతున్నదని పేర్కొన్న విపక్ష సభ్యులు అధికార పక్షం పట్ల స్పీకర్ పక్షపాత వైఖరిని ఖండించేందుకే తాము ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. స్పీకర్ నుంచి తమకు తగినంత రక్షణ లభించడం లేదని విపక్ష సభ్యులు తరచు భావిస్తున్నట్లు ఆర్‌జేడీ ఎంపీ అభయ్ కుమార్ సిన్హా చర్చ సందర్భంగా లోక్‌సభలో తెలిపారు. సభ స్వతంత్రతకు స్పీకర్ ప్రాతినిధ్యం వహించడం లేదని, ఆయన అధికార పార్టీ దౌర్జన్యానికి చిహ్నంగా మారిపోయారని సిన్హా ఆరోపించారు.ఒకే రోజు 140 మందికిపైగా ఎంపీలను సస్పెండ్ చేసిన రోజున కూడా సభ బ్లాక్ డే చూసిందని, తమ గొంతు కూడా వినాలని పేదలు, బలహీనులు భావించిన రోజే నిజమైన ప్రజాస్వామ్యమని ఆయన చెప్పారు. విపక్ష ఎంపీలు సభలో మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతి సారీ స్పీకర్ నుంచి వద్దు.. వద్దు.. వద్దు అన్న మాటలే పదేపదే వస్తాయని ఆయన చెప్పారు. విపక్ష సభ్యుల ప్రసంగాలకు అడ్డు తగలడం సభలో



నిత్యకృత్యంగా మారిపోయిందని జేఎంఎం ఎంపీ విజయ్ కుమార్ హన్స్‌దక చెప్పారు. అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని తెలిసినా పార్లమెంట్‌లో ప్రజాస్వామిక హక్కుల గురించి తమ ఆందోళనపై చర్చించే అవకాశాన్ని తాము కోరుకున్నామని ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ బజరంగ్ అన్నారు.

**స్పీకర్‌కు అమిత్ షా సమర్థన**

అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ స్పీకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పార్లమెంటరీ రాజకీయాల్లో బాధాకర చర్యగా ఆయన అభివర్ణించారు.

## పాఠశాల విద్య

# పాత చింతకాయ పచ్చడా?

విద్యా కమీషన్ సుమారు 40 పేజీల సూ చనలను కేవలం పాఠశాల విద్యపై చేసింది. అయితే వాటిని క్షుణ్ణంగా, లోతుగా అధ్యయనం చేయకుండానే విద్యారంగ వ్యక్తులు, టీచర్లు విమ ర్శించడానికి జీతభత్యాల తగ్గింపు, స్కూళ్ళ విలీనం, కాంట్రాక్టు నియా మకాలు, డీఎడ్ రద్దు, ప్రతిభ ఆధా రిత పదోన్నతులు వంటి పైత్యపు ప్రతిపాదనలు కారణమయ్యాయి.

2లో..

## ఎల్పీజీ కొరతపై భయాందోళన వద్దు..

**అనవసరంగా బుకింగ్ చేయవద్దు : కేంద్రం**



**న్యూఢిల్లీ:** దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో గ్యాస్ బుకింగ్‌లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ఎలాంటి భయాందోళనలు వద్దని తెలిపింది. అనవసరంగా గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేయవద్దని సూచించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా చమురుతోపాటు ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఎల్పీజీ సిలిండర్ల కొరతతో పాటు రేట్లు పెరుగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్త కోసం గ్యాస్ సిలిండర్లు బుక్ చేస్తున్నారు.కాగా, కేంద్ర ప్రభుత్వం బుధవారం దీనిపై స్పందించింది. దేశంలో తగినంత ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతం దేశంలో రోజుకు దాదాపు 55 లక్షల బ్యారెళ్ల ముడి చమురు అందుబాటులో ఉన్నదని మీడియా సమావేశంలో ప్రభుత్వ అధికారి వివరించారు.మరోవైపు ఈ కాలంలో సాధారణంగా హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే దానికంటే ఎక్కు వగా చమురు, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలోని డిమాండ్‌ను తీర్చడానికి తగినంత సేకరణ కూడా జరుగుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో దయచేసి అనవసరమైన ఎల్పీజీ బుకింగ్‌లను నివారించాలని ప్రజలను కోరింది.

## కేంద్ర మాజీ మంత్రి కావూరి కన్నుమూత

**నేడు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు**

**హైదరాబాద్, మార్చి 11 :** కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు(82) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తీవ్రం కావడంతో బంజారాహిల్స్‌లోని స్టార్ దవాఖానలో చేరారు. అక్క డ వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స పొం దుతూ పరిస్థితి విష



మించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని బుధవారం సాయంత్రం 5 గంటలకు బంజారా హిల్స్‌లోని నివాసానికి తరలించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మనువడు, ఎంపీ శ్రీభరత్ తెలిపారు.

# పాఠశాల విద్య

# పాత చింతకాయ పచ్చడా?

**విద్యాహక్కు** చట్టం చెప్పిన ఉచిత నిర్బంధ విద్యకు నిర్దేశించిన పాఠశాల విద్య ఎనిమిది దశాబ్దాలుగా అనేక రకాల మార్పులకు, ప్రయోగాలకు గురవుతూ వచ్చింది. సామాజిక డిమాండ్లకు అనుగుణంగా ఉన్నతీకరించబడుతూ వచ్చింది. అపెప్, డిపెప్, లెప్, క్లిప్, క్లాప్స్, క్యూఐపీ, తొలిమెట్టు పేర్లతో బోధనాభ్యాసన పద్ధతులు, కనీస అభ్యసన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు, సూక్ష్మ సామర్థ్యాలు ఇలా లక్ష్యాధారితంగా ప్రక్రియలు, తెలుగు నుండి ఇంగ్లీషు మాధ్యమానికి, పరీక్షల నుండి నిరంతర సమగ్ర మూల్యాంకనానికి, పునాది అక్షరాస్యత వంటి గుణాత్మక అంశాలకు, ప్రాజెక్టర్లు, కేయాన్లు, ఐఎఫ్పీలు, ట్యాబ్ లు, ఐఎక్సెల్ వంటి సాంకేతికతలకు రూపాంతరం చెందిన నేటి విద్య సరయిన ఫలితాలను ఇవ్వలేకపోవడంతో ప్రవేశాలు కేవలం 30 శాతానికి పడిపోయిన దుస్థితి. దాంతో నిర్వహణ భారంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చెయ్యడం, జీతాలను లెక్కించే స్థాయికి చేరుకున్నది. దీనిని అదనుగా చేసుకున్న విద్యా కమీషన్ సుమారు 40 పేజీల సూచనలను కేవలం పాఠశాల విద్యపై చేసింది. అయితే వాటిని క్షుణ్ణంగా, లోతుగా అధ్యయనం చేయకుండానే విద్యారంగ వ్యక్తులు, టీచర్లు విమర్శించడానికి జీతభత్యాల తగ్గింపు, స్కూళ్ళ విలీనం, కాంట్రాక్టు నియామకాలు, డీఎడ్ రద్దు, ప్రతిభ ఆధారిత పదోన్నతులు వంటి పైత్యపు ప్రతిపాదనలు కారణమయ్యాయి. అటు విద్యాహక్కు చట్టం, ఇటు సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తిని, ఉపాధ్యాయ హక్కుల సాంప్రదాయాలను గోడకేసి కొట్టిన ఈ సరికొత్త సిఫారసులను సర్వత్రా సర్ఫ్ ఎక్సెల్‌తో ఉరుకుతూనే ఉన్నారు.

రాష్ట్రంలో 18,317 ప్రాథమిక పాఠశాలల్లో 30లోగా విద్యార్థుల సంఖ్య ఉన్నవి 10640 అనగా సుమారు 60% అని, వీటివల్ల బడుల నిర్వహణ భారంగా మారడం, విద్యా నాణ్యత లోపిస్తుందని కమిషన్ సూత్రీకరించింది. దానికి పబ్లిక్ స్కూళ్లు మాత్రమే సర్వరోగ నివారిణి అని పరిష్కరించింది. తాజాగా సీఎం మానస పుత్రిక ఆయన "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు" సైతం ఆమోదయోగ్యం కాదని నివేదిక బయట ఆకునూరి మురళి గారు ఢంకా భజాయించారు. తాను చెప్పిందే శాసనమవ్వాలన్న తీరులో బాహుబలి డైలాగ్ చెప్పారు. బడి అందుబాటు అనేది ఆర్టీఈ నిబంధన అన్నది మరిచారు. ఈ విషయంలో వారు తిరిగిన 14 దేశాల్లోని స్థితిగతులను, సిట్యుయేషన్లను ఎక్కడ ఉటంకించలేదు. ఇలాంటి బడుల మీద ఆధారపడినది వారు అమితంగా ప్రేమించే బడుగు బలహీన వర్గాలని మాత్రం గుర్తెరగలేదు. జీరో స్కూళ్లను లేదా అత్యంత తక్కువ సంఖ్య ఉన్న బడులను కొనసాగించాలని ఎవరు కోరుకోవడం లేదు. కానీ పబ్లిక్ స్కూల్ ఒకటి పెట్టి గ్రామీణ విద్య గుడులైన సర్కారు బడులను నోట కరచుకొని పోవడమే అత్యంత దారుణం. విభిన్న ఆలోచనలు కలిగిన విద్యావేత్త మురళి బడులు పునరు జీవించే మంత్రజాలం చేస్తారని అందరూ ఆశించారు. ప్రాథమికోన్నత పాఠశాలలు సగం పైగా 50 లోపు ఉన్నవే. ఉన్నత పాఠశాలలు 4705 అయితే సుమారు 2000 బడుల్లో 100 లోపే సంఖ్య ఉన్నది. ఓ నిర్దిష్ట దూరాల్లో పాఠశాలలను విలీనం చేయడం వేరు. గంపగుత్తగా స్థానభ్రంశం చెందించడం వేరు. ప్రస్తుత ఆర్థిక స్థితిలో సుమారు 36 వేల కోట్ల పెట్టుబడి ఎలా సాధ్యం? ప్రాథమిక పాఠశాలల్లో 5 గదులున్నవి 2100 పాఠశాలలే అయితే ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నవి మాత్రం రెండంకెల సంఖ్య అయి ఉంటుంది. పరిశోధిస్తే మరో పరిష్కార మార్గం దొరికి ఉండేది. కానీ వారి టార్గెట్ కేవలం పబ్లిక్ స్కూళ్ల పితామహుడిగా నిలిచిపోవడమే అయినప్పుడు వేరే ఆలోచనలు ఎందుకు వస్తాయి?


పాఠ్యప్రణాళిక బట్టీ విధానానికి అనుగుణంగా ఉందని, ప్రశ్నించడం, విశ్లేషించడం, నిజజీవితన్యానికి అనుగుణంగా లేదని రాయడం ఒక పెద్ద తప్పుడు రాత. విద్యా హక్కు చట్టం అమలయ్యాక సీసీఈ అనేక మార్పులకు లోనయ్యింది. నేరుగా ఉండే ప్రశ్నలు ఒకటో తరగతి మొదలు ఎస్సెస్సీ కొరకు ఎక్కడా లేవు. జిల్లా పరీక్షల బోర్డు నుండి సెకండరీ బోర్డు వరకు తార్కిక ఆలోచనలకు, సృజనాత్మకతకు, అన్వయానికి అవకాశం ఉన్నవే. కృత్యాలు నేరుగా పాఠ్యపుస్తకం లోని పొందుపరచడం, అనుబంధంగా వర్కుబుక్కు, ఇవన్నీ రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి ఆధ్వర్యంలో నిరంతరంగా సాగుతున్నాయి. ఇంగ్లీషు మాధ్యమం, డిజిటల్ విద్య, పరీక్షల తీరుపై, ఫౌండేషనల్ నైపుణ్యాలపై లెక్కకు మిక్కిలి వృత్యంత శిక్షణలు, వాటికి తోడు ఆన్లైన్ కోర్సులు, జూమ్ సమావేశాలు నడుస్తూనే ఉన్నాయి. విద్యార్థి సమగ్ర అభివృద్ధి కోసం సహపాఠ్య అంశాలు ఉన్నాయి. వాటిపై కాస్త దృష్టి తగ్గినా విద్యార్థి కేంద్రీకృత విద్య ప్రశాంతం పైగా సాగుతున్నప్పటికీ వారు పక్కదారి పట్టించడమే బాధాకరం.



వారు రాసిన, గమనించిన మంచి విషయాలు ఏమైనా ఉన్నాయంటే పర్యవేక్షణ పోస్టుల కొరత, పరీక్షల భారంతో పాటు అత్యంత ముఖ్యమైనది బోధ నేత్ర పనుల వల్ల తగ్గిన బోధనా అభ్యసన సమయం, బహుళ తరగతుల బోధనవల్ల నాణ్యత తగ్గుతుందనడం. హైదరాబాద్ యూనివర్సిటీ, యూనిసెఫ్‌తో సమగ్ర శిక్ష ఉమ్మడిగా చేసిన సర్వే ఫలితంలో ఉపాధ్యాయులు కేవలం మూడు గంటల సమయాన్ని బోధనకు కేటాయించగలుగు తున్నారని, ప్రతి 15-20 నిమిషాల వ్యవధిలో ఆ సమయానికి అంతరాయం ఏర్పడుతుందని, బోధనేతర రిపోర్టులు రికార్డులు డిజిటల్ యంత్రాల ఆపరేటింగ్ నిర్వహణ కారణాలుగా చెప్పారు. కానీ వీటిని తొలగిస్తామని హామీ మాత్రం ఎక్కడా లేదు. వీటిపై ప్రభుత్వానికి సూచనలు కూడా ఎక్కడా కనపడలేదు.

ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ చెప్పినట్లు అత్యధిక వేతనాలు మాత్రమే మెరుగైన అభ్యసన ఫలితాలు ఇవ్వలేవని, స్థానికంగా ఉండడం దానికి మార్గం అన్నారు. పెరిగిన రవాణా సదుపాయాల ప్రస్తావన మరిచి విద్యార్థులను మాత్రం ఊర్లు వాడలు దాటించి పబ్లిక్ స్కూల్ కు పంపాలన్నారు. ఈ ప్రయాణం అక్కడ ఆటంకం కాదన్నారు. ఎటు చేసి ప్రభుత్వానికి భారం దింపాలని అనుకున్నారో, ప్రైవేటు బడులకు బాట పరచాలనుకున్నారో తెలియదు. ప్రపంచ వేతనాల జాబితాలో మన వేతనాలు 70వ స్థానాన్ని, దేశంతో పోలిస్తే 16వ స్థానమని వీరు తిరిగిన 14 దేశాలు, పది రాష్ట్రాల్లో గమనించకపోవడం బాధాకరం. కాంట్రాక్టు టీచర్లు ఎలా విశ్వసనీయత కలిగి ఉంటారో వారికి తెలియాలి. ఇప్పటికే పెన్షన్ పథకాలను మార్చి మార్కెట్ మాయాజాలంలో పెట్టారు. సాధారణ యువకులకు ఉపాధ్యాయ వృత్తి వైపుకు వచ్చే బాటలు అడ్డగించారు. ఇకపై వేతనాలను కూడా తగ్గించి, కాంట్రాక్టు నియామకాలు ఇచ్చేసి, ప్రతిభాధారిత పదోన్నతులిస్తే ఇప్పటికే క్రేజు తగ్గిన టీచర్ పోస్టుకు ఎవరు రావాలో వారే సెలవీయాలి. దానికి బదులు మెడికల్ ఇంజనీరింగ్ వైపు వేలం వెర్రిగా సాగుతున్న అడుగులను ఇటు వైపుగా మళ్ళించే ప్రయత్నం చేసి ఉంటే వారు ఒక సామాజిక శాస్త్రవేత్త అయి ఉండేవారు. బహుళ యాజమాన్యాలు కూడా ఓ తలనొప్పి అయిందన్నారు. అన్నిటికీ పరిష్కారం తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు అన్నారు. కేవలం ప్రభుత్వ స్కూల్లోనే కాక టీచర్లను వేతనాలను కూడా తగ్గించి, పిల్లల విద్య తల్లిదండ్రుల బాధ్యతగా అప్పగించేసి చేతులు దులుపుకొని ప్రైవేటులను బతికించాలన్నదే అప్రత్యక్ష ముక్తాయింపుగా ఉన్నది. నిబంధనలకు తిలోదకాలిచ్చిన ప్రైవేటు, కార్పొరేటులపై కొరడా లేదు. నియంత్రణ స్ట్రాటజీ లేదు. పాపం 5000 జీతానికి పనిచేస్తున్నారన్నారు. కోటి ఏడాది ప్యాకేజీ ఉన్న చైనా ( చైతన్య నారాయణ) టీచర్లు వీరికి తారసపడలేదు. లక్సెంబర్గ్, ఫిన్లాండ్, వియత్నాం, అమెరికా వంటి దేశాల ప్రభుత్వ ఉపాధ్యాయుల సాలరీ స్లిప్పులు వీరికి ఎక్కడా కనపడలేదు. ఆ స్థాయికి ఇక్కడి టీచర్ల వేతనాలు పెంచాలని ఎవ్వరూ ఆశపడడం లేదు. కానీ అకౌంటబిలిటీ లేదని, మార్కెట్ కంటే ఎక్కువ వేతనాలున్నాయని, యాంత్రిక పదోన్నతులు కూడదని, ప్రతిభా పరీక్షలు పెట్టి తొలగించాలని కసాయిగా మాట్లాడడమే నేటి అసలు సమస్య. ఎలుకలున్నాయని ఇల్లు తగలబెట్టిన చందంగా ఈ కథ కొనసాగింది. పాత పాఠశాలలన్నీ తూచ్, కొత్తవి కట్టుకుందామని వారు ప్రతి లైన్లో రాశారు. "ఈ గోడ పగులగొట్టు, సరికొత్త మేడ కట్టు" అని వివిధ భారతిలో చిన్నప్పుడు నాలుగు దశాబ్దాల నాడు విన్న పాట నేడు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నది. క్షేత్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలు, ఆలోచనలు మరింతగా రంగరించి మార్పులు చేసినపుడే ఈ నివేదిక టేబుల్ పై వరకు చేరుకునే అవకాశం ఉంటుంది. అలాంటి ఫ్లెక్సిబిలిటీ ఉంటుందో లేదో చూడాలి మరి!

**దాసరి శ్రీధర్**
**కరీంనగర్**



# సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు గడువును పెంచాలి

వాస్తవం : చెన్నూర్ ఆర్సి

మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం కోటపల్లి మండలంలో వివిధ గ్రామాల వేల ఎకరాల్లోనే నిలిచిన పత్తి పంట కొనుగోళ్ళు ఆపితే దళారుల రాజ్యం పాలవుతుందని పత్తి కొనుగోలు ప్రక్రియను మార్చి నెల చివరిదాకా కొనుగోలు సాగించాలని లేకుంటే పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతారని కొటపల్లి మండల బి.ఆర్ ఎస్ సోషల్ మీడియా బాపు నాయక్ అన్నారు.జిల్లాలో ఇప్పటికి 40% పత్తి రైతులు ఇండ్లలోనే నిల్వగా ఉందని వర్షాల కారణంగా, కూలీల కొరతతో పాటు రవాణా సమస్యల వల్ల పత్తి మొత్తం కొనుగోలు కేంద్రాలకు తరలించక పోయారని అధిక వర్షాలతో పత్తి ఉత్పత్తి ఆలస్యంగా జరిగిందని ఇప్పటికీ చేనులలో పత్తి ఉందని ఇలాంటి పరిస్థితుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిలిపివేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు మూసివేస్తే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలు చెప్పి రైతులను దోచుకునే అవకాశం ఉందని, ఇప్పటికే కొందరు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు పత్తి కొనుగోలు చేస్తున్నారని, పత్తి పండించడానికి రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారని, సరైన ధర రాకపోతే అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కోతలు విధించకుండా పత్తి



కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకొని మార్చి చివరి వరకు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు గడువును పెంచాలని కోటపల్లి మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా బాపు నాయక్ డిమాండ్ చేశారు.

## స్వపరిపాలన దినోత్సవం వేడుకలు



వాస్తవం : మోత్కూర్

బుధవారం రోజున మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కొండగడపలో స్వపరిపాలన దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు డీఈవో ఎంఈఓ మరియు ఉపాధ్యాయులుగా వారి పాత్రలు పోషించి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏ.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ బృందం ఎం.శ్యామల,జి. శ్రీనివాసరావు, సత్తయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# గుంతల ప్రయాణానికి శాశ్వత పరిష్కారం




వాస్తవం
నడుచుకుంటబోవుడే నయం

వాస్తవం ఎఫెక్ట్



- వాస్తవానికి స్పందన
- సీసీ రోడ్డు నిర్మాణం

వాస్తవం : రాజేంద్రనగర్

ఉడంగడ్డ చౌరస్తా నుండి దుర్గానగర్ వెళ్లే రహదారి గుండా గుంతలమయమైన రోడ్డుతో కొన్ని నెలలుగా వాహనదారులు, స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇదే అంశంపై గత నెల 23వ తేదీన వాస్తవం దినపత్రికలో 'నడుచుకుంటబోవుడే నయం' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఎట్టకేలకు జిహెచ్ఎంసి అధికారులు స్పందించడంతో మంగళవారం ఈ మూలమలుపు వద్ద నుండి దుర్గానగర్ చౌరస్తా వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. దీంతో వాహనదారుల ఇబ్బందులు తీరడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడనుంది. గుంతల మరమ్మతులు చేపట్టినా సమస్యలు పునరావృతమౌతూ ఉండేవని స్థానికులు సూచిస్తున్నారు. అధికారులు శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పది పరీక్షల్లో 100% ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**

**వాస్తవం : మోత్కూర్**



త్వరలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 100% ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసి ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు ఉన్న మోత్కూర్ పాఠశాల ఫలితాల్లో కూడా అత్యధిక మార్కులు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య నభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు .విద్యార్థులు ప్రసంగిస్తూ తాము పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవింద రాయుడు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తీపిరెడ్డి గోపాల్ రెడ్డి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బేటి శైలజ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు చేసిన డ్యాన్సులు అలరించాయి.



# వంట గ్యాస్ ధరల పెంపు సామాన్య ప్రజలపై భారం

**టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్**

**వాస్తవం: కాటారం**



తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ వంట గ్యాస్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు భారీగా పెంచడం వల్ల సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం పడుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి తీసుకుంటున్న నిర్ణయాలు సమంజసం కాదని విమర్శించారు.గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై రూ. 60, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 115 పెంపు దారుణమని పేర్కొన్నారు. ఈ పెంపుతో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర దాదాపు వెయ్యి రూపాయలకు చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపుతూ ధరలు పెంచడం సరైంది కాదని, చమురు ధరలు తగ్గినప్పుడు దేశం లో ధరలు తగ్గించిన సందర్భాలు చాలా అరుదుగా ఉన్నా యని అన్నారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే సూచనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరల పెం పును ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మా వార్డులో సెల్ టవర్ వద్దంటే వద్దు

## గ్రామస్తుల ఆందోళన

**వాస్తవం:ఎల్లారెడ్డిపేట:**



ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డు కాలనీలో ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణానికి స్థానికులు తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నివాస గృహాల మధ్యలో ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం కోసం భూమి యజమానితో ఒప్పందం చేసుకున్నారని సమాచారం.ఈ విషయంపై ఆందోళన చెందిన కాలనీ నివాసితులు, వార్డు సభ్యులు కలిసి ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ, ఎస్సైలకు వినతిపత్రం అందజేశారు. అయితే తమ సమస్యకు ఇంకా పరిష్కారం లభించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. సెల్ టవర్ నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా పిల్లలు, పెద్దల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, టవర్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వద్దనిస్పష్టం చేశారు. అవసరమైతే నిరాహార దీక్ష చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో కాలనీ నివాసితులు అక్కడే కూర్చొని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# చింతకానిలో పశువులకు గాలికుంటు టీకాలు



**వాస్తవం : కాటారం**

కాటారం మండలం చింతకాని గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 85 గేదెలు, 24 గోజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామ పశుపోషకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పశువులకు టీకాలు వేయించుకు న్నారు.ఈ సందర్భంగా రైతులు, పశుపోషకులకు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్య రక్షణలో టీకాలు కీలకమని అధికారులు తెలిపారు.మండల పశువైద్యాధికారి డా. జి. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా. ధీరజ్ పాల్గొన్నారు. పశు వైద్య సహాయకులు తుంగల రాజశేఖర్, సుల్తానాబేగం టీకాల ప్రక్రియను నిర్వహించారు.

# జనగణన పకడ్బందీగా పూర్తి చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



జనగణన – 2027 ను పకడ్బందీగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027 పై సెన్సెస్ ఫర్ వెల్ఫేర్ పేరిట ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో ఛార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లకు శిక్షణకార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొట్ట మొదటి స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యూ మరేషన్) అని వివరించారు. ఈ విధానంలో ప్రజలే తమ వివరాలు పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు.జిల్లా ప్రధాన గణన అధికారిగా జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు గణన అధికారిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గణన అధికారిగా శ్రీనివాసాచారి ఉంటారని తెలిపారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు.రాజ్యాంగం ప్రకారం జనగణన అనేది చాలా కీలకమైన అంశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనగణన చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ శిక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీని వాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు,తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



**వాస్తవం, దౌల్తాబాద్:** మిరుదొడ్డి మండలంలోని పెద్ద చెప్యాల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మీ తల్లితండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.అనంతరం ఉపాధ్యా యులు అబ్దుల్ రషీద్, మహేందర్, రమేష్, వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, యాద నరసింహులు, కన్యాకుమారి విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరం ఏర్పాటు

**వాస్తవం - ముప్కాల్**



ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రోజు ఉదయం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ బర్కం గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా శిబిరంలో అందించే సేవలు మధుమేహం గ్యాస్టిక్ సమస్యలు, మెడ నొప్పి, రక్తపోటు, శ్వాస కోశ వ్యాధులు, నడుము నొప్పి, పక్షవాతం, గొంతు, చెవి వంటి సమస్యలకు చికిత్సలను అందించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. 7 రోజుల పాటు ఇట్టి శిబిరం కొనసాగుతుందని, స్థానిక గ్రామస్తులు ఇట్టి అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో భాగంగా బుధవారం రోజు దాదాపు 15మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బర్కశీ గంగాధర్, ముప్కాల్ ఎస్సైకే కిరణ్ పాల్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ చాకు లింగం, ఆక్యు ప్రెషర్ తెరపిస్ట్ ఎస్కే సింగ్, నరుపత్ గరన్, ఉప సర్పంచ్, బర్కం లావణ్య శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే.విగ్నేష్, వార్డు సభ్యులు అక్కవత్రి ప్రవీణ్ కుమార్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ హరిజోన్స్ పాఠశాలలో
# ఫుడ్ ఫెస్టివల్



**వాస్తవం - ముప్కాల్**

ముప్కాల్ మండల కేంద్రంలోని న్యూ హరిజోన్స్ పాఠశాలలో బుధవారం రోజు మధ్యాహ్నం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంను చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఇంటి వద్ద చేసిన రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. వంట చెఫ్ రమేష్ విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూసి ప్రతిభను గుర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పండెంట్ భూస రత్నాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**వాస్తవం:మనోహరాబాద్:**



మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ప్రతిమ సింగ్‌ను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నర్సాపూర్ శాసనసభ్యులు వాకిటి సునీత లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, శివంపేట బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ రమణ గౌడ్,మెదక్ జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు పంచమి రేణు కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్ ను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు,ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కోరారు.జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ,జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## వేంపల్లి ఉపాధి హామీ పనులను
# సందర్శించిన ఎంపీవో



**వాస్తవం -ముప్కాల్**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజు మండలంలోని వేంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ మహేష్ యాదవ్, ఎంపీవో గౌస్ మోహినొద్దిన్ సంయుక్తంగా కలిసి పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో శుభ్రతలో భాగంగా వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం జరిగిందని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కార్యదర్శి దేవేందర్, వార్డ్ సభ్యులు దీపక్, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని
# పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**వాస్తవం : కాటారం**

కాటారం కేంద్రంలోని తోటవాడలో ఇటీవల మరణించిన తోట సదానందం కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వారికి కలిగిన లోటు తీరనిదని పేర్కొంటూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జక్కు రాకేష్, మండల అధ్యక్షులు జోడు శ్రీనివాస్, ఊర వెంకటేశ్వరరావు, పంతకాని సదువలి, జక్కు శ్రావణ్, ఉప్పు సంతోష్, రామిల్ల రాజు, చీమల వంశీ, మేడిగడ్డ దుర్గారావు, కామిడీ ప్రమోద్ రెడ్డి, రమణా రెడ్డి, తోట రాజు, శ్రావణ్, బాపు గడిపెల్లి రవి తదితర భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.



## మహిళా సంక్షేమానికి
# మొదటి ప్రాధాన్యత

**మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల, మార్చి 11(వాస్తవం)**

మహిళల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం జైపూర్ మండలం ఇందారం గ్రామంలో గ్రామైఖ్య సంఘాల భవనాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.30 లక్షల వ్యయంతో మూడు భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 39 మంది కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190


# కొత్త లేబర్ కోడ్స్ పై అవగాహన సదస్సు

**కేంద్ర ప్రభుత్వ 29 చట్టాలను**
**లుగు లేబర్ కోడ్స్‌గా మార్చిన వైనం**
**కార్మికుల భద్రత ,సంక్షేమం, హక్కులు ,వేతన నిర్మాణం**
**పారదర్శకత కై ప్రత్యేక లేబర్ కోడ్స్**



**వాస్తవం : మందమర్రి**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి జిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంల కేంద్ర ప్రభుత్వంఇటీవల అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్ పై అవగాహన కార్యక్రమము బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) భారత ప్రభుత్వ కార్మిక ఉపాధి శాఖ బిశ్వ భూషణ్ ప్రుస్టి, ముఖ్య అతిథులు గా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), మంచిర్యాల ఉ రామగుండం,యం.డి యూసఫ్ చౌటుపల్లి, మందమర్రి ఏరియా ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ ..కేకే ఓసి (ప్రాజెక్టు ఆఫీసర్) మల్లయ్య పాల్గొన్నారు.ముందుగా మందమరి ఏరియా ఇన్చార్జి జనరల్ మేనేజర్ మల్లయ్య, ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్ .ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్,ఇతర అధికారులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) భారత ప్రభుత్వ కార్మిక,ఉపాధి శాఖ బిస్వ భూషణ్ ప్రుస్టిని సన్మానించి,స్వాగతం పలికారు.అనంతరం వివిధ గనుల,విభాగాల అధికారులకు,సంక్షేమ అధికారులకు,కాంట్రాక్టర్లకు,అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) బిస్వ భూషణ్ ప్రుస్టి మాట్లాడుతూ. .కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉన్న 29 చట్టాలను కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్‌గా.. 21 నవంబర్ నుండి మార్చారు,దీని అమలు పై అవగాహన కార్యక్రమం ద్వారా అందరికీ ఉపయోగకరమైన మార్గదర్శకాలు లభిస్తాయని కార్మికుల సంక్షేమం, హక్కులు, భద్రత, వేతన నిర్మాణం, పారదర్శక ఉద్యోగ వ్యవస్థ కోసం, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన, ఈ.. కొత్త లేబర్ కోడ్స్ సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేయడం అత్యంత అవసరం అని తెలిపారు.ఈ సమావేశంలో.. కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు,ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జ,డీ.జీ.ఎం పర్సనల్ అశోక్,సివిల్ ఎస్.ఇ శ్రీధర్,డి.వై పి.ఎం ఎం.డి ఆసిఫ్,సీనియర్ పి.ఓ వంశీ,అన్ని గనుల సంక్షేమ అధికారులు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

# కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి**




**వాస్తవం : అందోల్**

అందత్వ నివారణ కోసం ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని ఆందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి అన్నారు.శంకర్ నేత్రాలయ( మేసు) హైదరాబాద్,దామోదర్ రాజనర్సింహ ఆరోగ్య శాఖ మంత్రి, శంకర్ నేత్రాలయ (యూఎస్ఏ) వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగు నింపడానికి నేత్ర శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని వారం రోజులపాటు జరిగే ఈ శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొని పరీక్షలు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు,డాక్టర్లు,మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్,డాకూరిశంకర్,నాని, పిట్ల లక్ష్మణ్,అల్లి శ్రీకాంత్ రాజశేఖర్,కాంగ్రెస్ నాయకులు జి కృష్ణ,జి శ్రీనివాస్,నందు,మధు, యాదగిరి,అనిల్,శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల తంగళ్లపల్లి మానేరు బ్రిడ్జిపై రైతుల ధర్నా




**వాస్తవం : తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం 11వ ప్యాకేజీ కింద ఎల్ ఎం -6, ఎల్ ఎం -4 కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండల రైతులు ధర్నా చేపట్టారు.సిరిసిల్ల- తంగళ్లపల్లి మానేరు వాగు బ్రిడ్జిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.ఈ ధర్నాకు బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి,నాయకులు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. పోలీసులు ధర్నా చేస్తున్న రైతులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంధర్బంగా బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడారు.తంగళ్లపల్లి 11వ ప్యాకేజీ రంగనాయక సాగర్ ద్వారా కెనాల్ నిర్మాణ పనులకు రూ. 3 కోట్లు నిధులు కేటాయించి పనులు చేపట్టకపోవడం పట్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రెడ్డబోయిన గోపి అన్నారు. తంగళ్లపల్లి మండలంలో సుమారు 15 గ్రామాలకు నీరందించే కెనాల్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం కానీ.. స్థానిక ఎమ్మెల్యే కెటిఆర్ కానీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.ఈ కెనాల్ నిర్మాణం ద్వారా 10 వేల ఎకరాలకు సాగు నీరందుతుందని,అయినా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. దీనిపై కెటిఆర్ కూడా మౌనం వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరైనా కూడా భూసేకరణ పనులు చేపట్టలేదని విరుచుకుపడ్డారు. రైతుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం,సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ నిర్లక్ష్యం చేయడంపై దుయ్యబట్టారు. కెనాల్ నిర్మాణం కోసం రైతులు దీక్షా చేస్తున్న పట్టించుకోవడం లేదని,రైతుల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190




## ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో స్వచ్ఛభారత్



**వాస్తవం : వేములవాడ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో బుధవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఇందులో ఆసుపత్రి సిబ్బంది నర్సింగ్ ఆఫీసర్స్ హెడ్ నర్సెస్ నర్సింగ్ సూపరిండెంట్లతో పాటు వైద్యులు డాక్టర్ రవీందర్,డాః పెంచలయ్య,డాక్టర్ చారి, డాక్టర్ రాజశ్రీ,డాక్టర్ తిరుపతి,తదితరులు పాల్గొని ఆసుపత్రి ఆవరణను,ఆసుపత్రి లోపల వార్డులను శుభ్ర పరిచారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి సహాయకులకు వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల శుభ్రత గురించి పలు సూచనలు చేశారు.

**చెరువు శిఖంలో**

## కట్టినా జోలికి వెళ్ళని అధికారులు

**కాసులు ఇస్తే పర్మిషన్ జాంతానై**




**వాస్తవం : అందోల్**

ఓ పక్క బహుళ అంతస్తుల్లో సెల్లార్‌లోకి నీళ్లు వస్తున్నా అది కనబడనట్టుగా పర్మిషన్లు ఇచ్చారు, సంబంధితఅధికారులు. అప్పుడు గుర్తుకురాని ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్, 9వ వార్డు లోని 409 సర్వేనెంబర్ పట్టా భూమిలో పశువులకు కొట్టం నిర్మించుకుంటే,అది బఫర్ జోన్ అని అధికారులు కూల్చివేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.అలా కూలగొట్టలనుకుంటే మెయిన్ రోడ్ లోని వందలాది షట్టర్లు కూల్చి వేయాల్సి వస్తుందని పలువురు విమర్శిస్తున్నారు.ఎవరో బ్లాక్మెయిలర్లు ఫిర్యాదు చేస్తే కూల్చివేయడమే నాని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అందోల్ జోగిపేట అధికారులు ఉన్నవారికి ఓ న్యాయం లేని వారికి ఓ న్యాయం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

**మహిళా మండలి ఆధ్వర్యంలో**

## మహిళా దినోత్సవ వేడుకలు



**వాస్తవం : ముప్కాల్**

జామాబాదుముప్కాల్ మండల కేంద్రంలో బుధవారం రోజు ఉదయం స్థానిక కస్తూర్బా మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసు సిబ్బందితో పాటు మహిళా సంఘాల పెద్దలను సన్మానించారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు నాయకుడు పద్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో మహిళలను ఘనంగా సన్మానించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు నాయకుడు పద్మ,సెక్రటరీ పద్మ,సభ్యులు చింతల పద్మ, నికిలేశ్వరి,గడ్డం రాజవ్వ,మంగళమ్మ తదితర మహిళలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మడ్ రిజర్వ్ పాత్ర కీలకం

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఫైరింగ్,రాత పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన

వారికి ప్రశంసలు






**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోందని రాజన్న సిరిసిల్లజిల్లా ఎస్పీ మహేష్ బి గితే అభినందించారు.సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ…మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు,సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మడ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు,సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్,ఫుట్ డ్రిల్,సెర్మోనియల్ డ్రిల్,గార్డ్ మౌంటింగ్,మాబ్ ఆపరేషన్,ఫైరింగ్,నాకబందీ,పికెట్స్,వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్, క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు.పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని ఎస్పీ గారు సూచించారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు,సిబ్బందికి వ్యక్తిగత,కుటుంబపరమైన మరియు శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు.అంతకు ముందు వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న,అధికారులకు సిబ్బందికి సార్దాపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఇచ్చే ఫైరింగ్ శిక్షణను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు.అనంతరం ఎస్పీ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగింది.ఫైరింగ్లో ఉత్తమ ప్రతిభలో కనబర్చిన ప్రథమబి శ్రీనివాస్,ద్వితీయ జి వెంకటేష్, తృతీయ ఏప్రియాంక,రాత పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రథమ మనోజ్ కుమార్,ద్వితీయ బి శ్రీనివాస్,తృతీయ డి.ప్రియాంకలకు మెమొంటో ప్రశంస పత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య,ఆర్ఐలు,ఎస్ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో

# ప్రజాపాలన కార్యక్రమం



**వాస్తవం : తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంక్ శుద్ధికరణ,పాత బోరుల మూసివేత కార్యక్రమం తంగళ్ళపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ సర్పంచ్ మోర లక్ష్మీరాజం,ఉపసర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జిందం సంతోష్,గజ భీంకార్ శంకర్ ,సద్ద రోజ, ఎగుమామిడి సరిత రెడ్డి,అడ్డగట్ల ప్రవంతి,గుంజె మల్లేశ్వరి,సెక్రటరీ సమీర్,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ఎంఈఓ విజయకుమార్

**వాస్తవం : ఆత్మకూర్**

ఆత్మకూరు హనుమకొండ జిల్లాలోని స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థుల నుండి ఆన్లైన్, ఆఫ్ లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి విజయకుమార్ తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1తేదీ సెప్టెంబర్ 2017 నుంచి31 ఆగస్టు 2018 మధ్యన జన్మించిన విద్యార్థులు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 13 నుండి 17 వరకు మండల స్థాయిలో పోటీల్లో ఎంపిక నిర్వహించబడతాయని అందులో ఎంపికైన వారిని 28 మార్చి నుండి 1ఏప్రిల్ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తారనితెలియజేశారు.ఆసక్తి గల విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయుల నుండి, సూచనలు తీసుకొని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు తనను సంప్రదించాలని విజయ్ కుమార్ తెలియజేశారు.

ప్రజా పాలనలో భాగంగా

# పొట్టపల్లి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

**వాస్తవం : లక్ష్మణ చందా**



ఈరోజు లక్ష్మణ్ చాందా మండలంలోని పొట్టపల్లి (కె)గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ గౌరవ శ్రీమతి అభిలాష అభినవ్ పర్యటించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ముందుగా గ్రామస్తులతో శ్రమదానం చేసి అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణ ఎలాంటి మొక్కలు నర్సరీలో పెడుతున్నారు అని అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే కొన్ని టేకు మొక్కలు పెట్టాలని సూచించడం జరిగింది.నర్సరీ నిర్వాణ చాలా బాగుందని అభినందించడం జరిగింది.అనంతరం మహిళలతో చర్చించి మీకు ఏమైనా నైపుణ్యాలు ఉంటే వివో లీడర్ కి మరియు ఎంపీడీవో గారికి చెప్పినట్లయితే దానికి సంబంధించిన ట్రైనింగ్ ఇప్పిస్తామని అలాగే మహిళలందరూ వ్యాపారాలు చేసి గొప్ప వ్యాపారం వేత్తలుగా తయారు కావాలని తెలియజేయడం జరిగింది.గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాలను చూసి సర్పంచ్ గారిని కలెక్టర్ గారు అభినందించడం జరిగింది. మహిళలందరికీ మెడికల్ చెకప్ చేయాలని ఏఎన్ఎంకి ఆదేశించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో సీఈఓ జిల్లా పరిషత్,డిపిఓ,ఈఈ ఆర్డబ్ల్యూఎస్ ఎంపీడీవో,ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.






# కార్మికులంటే చిన్న చూపు ఎందుకు ?

హైవేలపై స్వీపింగ్ మిషన్లతో పారిశుద్ధ్య పనులు చేయించాలి

వనపల్లి జైపాల్ రెడ్డి

**వాస్తవం : రాజేంద్రనగర్**

విధి నిర్వహణలో భాగంగా మున్సిపల్ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు పట్టించుకోకుండా వారిని చిన్న చూపు చూడటం సిగ్గుచేటని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని నేషనల్ హైవే లపై ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేకుండా అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు.బుధవారం ఉదయం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో తెల్లవారుజామున పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. కార్మికులు రోడ్డును ఊడ్చే క్రమంలో ఓవర్ స్పీడ్ తో వచ్చిన కారు వారిని ఢీ కొట్టిందని పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా మరొకరు కొన ఊపిరితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పారిశుద్ధ్య ఇంచార్జ్ రామచందర్, ఏఈఈ రాజేష్ తో కార్మికుల భద్రతపై చర్చించామన్నారు.నగరం నుండి శంషాబాద్ ఎయిర్పోర్ట్కు వెళ్లే వాహనాలు శంషాబాద్ నుండి హైదరాబాద్ కు వచ్చే వాహనాల వేగం ఎక్కువగా ఉంటుందన్నారు. సుమారు 120 నుండి 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంటాయని తెలిపారు. ఇలాంటి సందర్భంలో ప్రమాదకర స్థాయిలో సెంటర్ డివైడర్లలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైవేల సెంటర్ డివైడర్ల వద్ద మెకనైజ్డ్ స్వీపింగ్ మిషన్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రమాదకరమైన విధి నిర్వహణలో కార్మికులు ప్రాణాలు కోల్పోతే పూర్తి బాధ్యత జిహెచ్ఎంసి అధికారులదే అని హెచ్చరించారు.కార్మికుల విధి నిర్వహణలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదని వారి ప్రాణాలకు హాని కలగకుండా వారి భద్రత ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. అధికారులు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



# పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు సామాగ్రి పంపిణీ

మంచిగా రాసుకొని ప్రతిభ సాధించాలి
యూత్ కాంగ్రెస్ నేత న్యాత నవీన్
వాస్తవం : చందుర్తి





వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో చందుర్తి మండలంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో గత కొన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరీక్షలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు దాదాపు 250 పైచిలుకు విద్యార్థి విద్యార్థులకు ఏడు రకాల ఎగ్జామ్ సామాగ్రి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారు ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు న్యాత నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం చందుర్తి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో చదువుతున్న విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పరీక్షలకు అవసరమైన సామాగ్రిని న్యాత నవీన్ అందజేశారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందితే వారు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తమ కుటుంబాలకు మరియు సమాజానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యారంగం అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని,విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని న్యాత నవీన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల ప్రజా ప్రతినిధులు,సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొని న్యాత నవీన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలనుఅభినందించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతపురి బాలు రెడ్డి,ఉపాధ్యక్షుడు ఆదిత్య రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు గసికంటి అశోక్,పసుల సమర్పన్,మ్యాదరి జాన్,బింగి జలంధర్, తదితరులు,యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పథకం విద్యార్థులకు ఒక వరం

**భూక్యా శ్రీను నాయక్**
**జిల్లాస్థాయి క్రీడలలో సత్తా చాటిన శివరాంపల్లి**
**జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు**
**వాస్తవం : రాజేంద్రనగర్**





పీఎం శ్రీ పథకం విద్యార్థులకు ఒక వరం లాంటిదని జిల్లా స్థాయి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉందని శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీను నాయక్ తెలిపారు. పీఎం శ్రీ క్రీడా పోటీలలో భాగంగా రంగారెడ్డి జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ,ఖో ఖో,వాలీబాల్,అథ్లెటిక్స్ పోటీలు సరూర్ నగర్ లో జరిగాయి.ఈ పోటీలలో శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి పతకాలు, ప్రశంసలు సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీను నాయక్, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ..పీఎం శ్రీ నిధుల నుండి విద్యార్థులకు క్రీడా దుస్తులు, పరికరాలు, లాంగ్ జంప్ ఫిట్ వంటివి ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు,క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కబడ్డీలో పి.లక్ష్మణ్,సాయికుమార్,జస్వంత్,అరుణ్ ప్రథమ బహుమతి గెలుపొందారన్నారు.కబడ్డీలో సభాఅన్సారి, కీర్తన మొదటి బహుమతి గెలుపొందగా వాలీబాల్లో చేతన్, సిద్ధి వినాయక విజేతలుగా నిలిచారన్నారు. అంతేకాకుండా ఖో ఖో లో రిషి, సూరజ్ ద్వితీయ బహుమతి గెలుపొందారన్నారు. బుధవారం పాఠశాలలో ప్రార్థన సమయంలో గెలుపొందిన క్రీడాకారులకుప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి కే గంగ నాయక్ జ్యోతి ఉపాధ్యాయులు కే సుదర్శన్ సరళమ్మ వెంకటయ్య నరసింహ చారి జనార్దన్ చారి స్టాఫ్ సెక్రటరీ సుధాకర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పరాక్రమ యోధుడు,ధర్మ వీర్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ వర్ధంతి

వాస్తవం : వేములవాడ




పరాక్రమ యోధుడు ధర్మవీర్ ఛత్రపతి శంభాజీ మహా రాజ్ 337 వ వర్ధంతి కార్యక్రమాన్ని వేములవాడ పట్ట ణంలోని న్యూ అర్బన్ కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శంబాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. శంబాజీ మహారాజ్ జీవన చరిత్రను వివరించారు.చిత్రహింసలకు శంభాజీ మహారాజ్ త్యాగం మరాఠా చరిత్రలో అద్వితీయమైనదని,స్ఫూర్తి దాయకమైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉ పాధ్యాయులు దుర్శెట్టి లక్ష్మీనారాయణ,దాసరి సుజాత,అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ జర్నలిస్టుల
## మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



మంచిర్యాల : వాస్తవం

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల జిల్లా మహాసభల కరపత్రాలను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం మంచిర్యాల పట్టణంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళిత, గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. సామాజిక, ఆర్థిక రంగాలలో దళిత, గిరిజనులను ముందుకు తీసుకువచ్చేందుకు ఎస్సీ,ఎస్టీ జర్నలిస్టులు కృషి చేయాలని సూచించారు.అలాగే పత్రికలు,టీవీ ఛానళ్లలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు కీలక పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కొండ శ్రీనివాస్, కె. ప్రేమ్ కుమార్, ఆవుల శ్రీధర్, బోగే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



దౌల్తాబాద్ : వాస్తవం

దౌల్తాబాద్ మండలం గోవిందపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు ఇలా ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం ద్వారా చదువుపై మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. డీఈవోగా సంజయ్,ఎంఈఓగా భాను ప్రసాద్, ప్రధానోపాధ్యాయులుగా వరుణ్ లు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మమత,వందన తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం



వాస్తవం : మనోహరాబాద్

చెట్ల గౌరారం గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శి శ్రీనివాస్ ను సర్పంచ్ చింతకింది దివ్య శ్రీ హరి గౌడ్, పాలకవర్గ సభ్యులతో కలిసి సన్మానించారు.మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా శ్రీనివాస్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.గతంలో కార్యదర్శిగా విధులు నిర్వహించిన విజయ్ భాస్కర్ బదిలీ కాగా ఆయన స్థానంలోకి శ్రీనివాస్ వచ్చినట్లు శ్రీహరి గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ,పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యదర్శి శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసయ్య,పాలకవర్గ సభ్యులు,నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు

# పందిళ్ళ సుచేత ప్రతిభా పురస్కారాలు

వాస్తవం : ధర్మసాగర్

పదవ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలిక విద్యార్థులకు పందిళ్ళ సుచేత ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు నమస్తే తెలంగాణ వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ళ అశోక్ కుమార్ తెలిపారు. ఇటీవల అశోక్ కుమార్ తల్లి పందిళ్ళ సుచేత మరణించారు.కాగా వారి తల్లిగారైన పందిళ్ళ సుచేత జ్ఞాపకార్థం ప్రతి యేట ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు బుధవారం ధర్మసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రకటన తెలియజేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.ప్రథమ బహుమతి రూ.5వేలు,ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలతో పాటు మెమెంటో, శాలువతో సత్కరించనున్నట్లు తెలిపారు.ఈ సంవత్సరం



నుండి ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రతిభా పురస్కారాలు అందుకోవాలని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పందిళ్ళ రమేష్ బాబు,అశోక్ కుమార్,మహేష్ బాబు,పాఠశాల హెచ్ఎం మురళీ,స్థానిక సర్పంచ్ మాచర్ల జ్యోతి,ఉపసర్పంచ్ కొంతం కొమురమ్మ,నాయకులు గుర్రపు ప్రసాద్,రొండి రాజు,కునూరు రాజు,దుర్గయ్య, కొలిపాక రమేష్,డాక్టర్ రామరావు తదితరులు పాల్గొన్నారు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ని కలిసిన

# ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఓ వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ని బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఎల్లారెడ్డిపేట సిఐ గా బాధ్యతలు స్వీకరించిన ఓ వెంకటేష్ కి ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

### రాచర్ల బొప్పాపూర్

### వ్యవసాయ మార్కెట్ కమిటీ

# సాధారణ సమావేశం



వాస్తవం : ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సబీరా బేగం గౌస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనవరి,ఫిబ్రవరి నెలల ఆదాయం--వ్యయాలను సమీక్షించారు. అలాగే 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ కమిటీ రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించి,మంజూరు కోసం తెలంగాణ ప్రభుత్వానికి,హైదరాబాద్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి, డైరెక్టర్లు మరియు సభ్యులు పాల్గొన్నారు.

### ఉత్తమ్ నగర్ ఢిల్లీలో తరుణ్ కుమార్ హత్యను

# ఖండించిన ఆరెకటిక అభివృద్ధి సంఘం

వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఢిల్లీ ఉత్తమ్ నగర్ ప్రాంతంలో జరిగిన తరుణ్ కుమార్ హత్య ఘటనను ఆరెకటిక అభివృద్ధి సంఘం తీవ్రంగా ఖండించింది.కటిక సామాజిక వర్గానికి చెందిన తరుణ్ కుమార్ హోలీ పండుగ రోజున జరిగిన ఘర్షణలో దారుణంగా హత్యకుగురైనట్లు సమాచారం.హోలీ సందర్భంగా ఒక ఆరు సంవత్సరాల బాలిక రంగులు ఆడుతూ ఉండగా చేయి జారి పడిపోయి అక్కడ ఉన్న ఒక మహిళపై పడటంతో వివాదం మొదలైనట్లు తెలిసింది.ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన కొంతమంది వ్య క్తులు గుంపుగా వచ్చి తరుణ్ కుమార్ ఇంటి వద్ద గొడవకు దిగినట్లు పేర్కొన్నారు.కుటుంబ సభ్యులు తమవద్ద నుండి పొ రపాటు జరిగిందని క్షమించాలని కోరినా వినకుండా దాడికి దిగారని తెలిపారు. ఈ దాడిలో బజరంగ్ దళ్ కార్యకర్తగా ప నిచేస్తున్న తరుణ్ కుమార్‌ను తీవ్రంగా కొట్టి హత్య చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై రాష్ట్ర ఆరెకటిక అభివృద్ధి సంఘం అధ్యక్షులుమిర్యాలకర్ శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని శిక్షించా లని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రాష్ట్ర ఆరెకటిక అభివృ ద్ధి సంఘం నాయకులు చనిపోయిన తరుణ్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అవసరమైతే ఢిల్లీ ముఖ్యమంత్రికి లేఖ రాసి న్యాయం చేయాలని



డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఆరెకటిక అభివృద్ధి సంఘం అధ్యక్షులు బొంపల్లి అశోక్ కూడా తరుణ్ కుమార్ కుటుంబానికి సానుభూతి తెలియజేశా రు.సమాజంపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభు త్వం తగిన భద్రత కల్పించాలని నాయకులు కోరారు.

# చట్టసభలల్లో ఓంకార్ పాత్రపై సభను జయప్రదం చేయండి

**యంసిపి ఐ(యు) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మైదం శెట్టి రమేష్**

**వాస్తవం : శేర్లింగంపల్లి**

ఈనెల 17వ తేదీన రవీంద్ర భారతి హైదరాబాదులో జరిగే సభను జయప్రదం చేయాలని బుధవారం మియాపూర్ స్టాలిన్ నగర్ ఎంసిపిఐ (యూ) పార్టీ జెండా దగ్గర గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కామ్రేడ్ మైదం శెట్టి రమేష్ మాట్లాడుతూ... వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు మాజీ శాసనసభ్యులు ఎం సిపిఐ(యు) వ్యవ స్థాపక నేత అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజ యంతి వార్షికోత్సవం, కామ్రేడ్ ఓంకార్ తన ఆరున్నర శతాబ్దాల రాజకీయ పరస్థానంలో ఏ శక్తులకు లొంగకుండా రాజకీయాల కు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు,నిత్యం ప్రజల కో సం జీవించిన ఆయను శత్రువు హత్య దాడులు చేసిన చావుకు తలవంచని మృత్యుంజయుడు ప్రజా సమస్యల పైన చట్టసభల ల్లో ప్రజా గళం వినిపించిన అసెంబ్లీ టైగర్ తెలుగు రాష్ట్రాల ప్రజలు మెచ్చిన నిస్వార్థ ప్రజా సేవ కుడుకామ్రేడ్ ఓంకార్. ఓం కార్ జీవితకాలమంతా ప్రజల కోసం తపించి పనిచేశారు అలాంటి ఓం కార్‌ని వరంగల్ జిల్లా నర్సంపేట శా సనసభ నియోజకవర్గ ప్రజలు 1972 నుండి 1994 వరకు ఐదుసార్లు శా సనసభ్యునిగా అత్యధిక మెజార్టీతో గెలి పించుకున్నారు. నర్సంపేట శాసన సభ్యునిగా రాష్ట్ర శాసనసభలో ప్రాతి నిధ్యం వహిస్తూనే ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలకు ఏ సమస్య వచ్చి నా చట్టసభలలో ప్రజాగళంగా విని పించేవారు. పాలకవర్గాలకు లొంగ కుండా ఏ



పార్టీకి తోకగా మార కుండా చట్టాల అమలులో అవకత వకలపై భూ సమస్యలపై, విద్యా వై ద్యం విధానం, ఉద్యోగ కల్పన, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి,నీళ్ల నిధులు పంప కాలపై అసెంబ్లీలో ధారాళంగా మా ట్లాడి అనేక సూచనలు చేస్తూ ప్రజల గొంతుకైనా ఓంకార్‌ని ప్రజలు అసెం బ్లీ టైగర్‌గా అభివర్ణించుకున్నారు. బూటకపు ఎన్కౌంటర్ల ను వ్యతిరేకిస్తూ నక్సలిజం ప్రభుత్వ వైఖరి అనే అం శంపై శాసనసభలో ఏకధాటిగా రెం డున్నర గంటలు ప్రసంగించి శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వ ము భార్గవ కమిషన్ (ఏకసభ్య కమిషన్) వేయించడంలో ఓంకార్ పాత్ర అమోఘమైనది కామ్రేడ్‌ను ఆదర్శ వంత మైన జీవితాన్ని పోరాటస్ఫూర్తులను స్పందిస్తూ 2025 మే 12 నుండి 2026 మే 12 వరకు సం వత్సర కాలం పాటు కార్యక్రమాలను వివిధ రూపాలలో ఎంసి పిఐ(యు) పార్టీ నిర్వహిస్తుంది కార్యక్రమంలో భాగంగా 2026 మార్చి 17న ఉద యం 10 గంటల నుండి సాయంత్రం 5 గం టల వరకు హైదరాబాదు రవీంద్రభారతిలో చట్టసభలలో ఓంకార్ పాత్ర అనే అంశంపై రాష్ట్ర స్థాయి సభను నిర్వహించడం జరుగుతుంది. ఈ సభకు రాష్ట్ర మంత్రులు,శ్రీధర్ బాబు , సీతక్క ,జూపల్లి కృష్ణారావు మరియు వామపక్ష పార్టీ జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారు కావున ఈ సభ జయప్రదానికి అన్ని వర్గాల ప్రజలు ప్రజాతంత్ర వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయకార్యదర్శి తుడుం అనిల్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు తాండ్ర కళావతి,ఇస్లావత్ దశరథ్ నాయక్,కమిటీ సభ్యులు పి భాగ్యమ్మ, యం రాణి, విజయలక్ష్మి, కిషన్, గంగాధర్ లక్ష్మి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సార్లు మార్చింది..కండువాలేనంట

# పార్టీలు కాదంట?



## వారెవ్వా..ఏం తీర్పు..అచ్చం అనుకున్నట్లే ఉందే?



కె.ఆర్ ఉన్నమాట

ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేకి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు. ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే.. రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా.. భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.

- దానం ఎమ్మెల్యేగా గెలిచింది కారు గుర్తు మీద..ఎంపీగా పోటీచేసింది హస్తం గుర్తుతో
- అయినా ఆయన పార్టీ మారినట్లు కాదంట..బీఆర్ఎస్‌లో ఉన్నట్లే అంట
- కడియం ఎమ్మెల్యేగా గెల్చింది బీఆర్ఎస్ బీఫామ్‌తో..
- ఎంపీ ఎన్నికలో ప్రచారం చేసింది కాంగ్రెస్ కోసం
- అయినా ఆయన పార్టీ మారలేదు..కారు దిగలేదు...

కారు గుర్తు మీద పోటీ చేసి గెలుపొందిన 10 మంది శాసన సభ్యులు తాము ఇంకా కారు దిగలేదు..పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాలను స్పీకర్ విశ్వసించి వారు పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేని కారణంగా వారికి క్లీన్‌చీట్ ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నట్లయింది.ఇరకాటం నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటపడినట్లయింది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.స్పీకర్ నిర్ణయం సరైనదా? కాదా? అనేది మనం తప్పుపట్టలేకపోవచ్చు.ఎందుకంటే అత్యున్నత స్థానమైన స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టే స్వేచ్ఛ,అధికారం లేకపోవచ్చు.స్పీకర్ స్వతంత్రత విషయంలో మనం పరిధి దాటి మాట్లాడలేకపోచ్చు.అయితే గతంలో పార్టీలు మారిన వారు లేరా? అప్పుడెందుకు వారిపై అనర్హత వేటు పడలేదని అనేవారు ఉన్నారు.ఒక పార్టీ బీఫామ్ మీద పోటీ చేసి మరో పార్టీలోకి ఫిరాయిస్తే అది ఎప్పుడు జరిగినా అనైతికమే..రాజకీయ పతనమే.గతంలో జరిగినా..ఇప్పుడు జరిగినా..భవిష్యత్‌లో జరిగినా ఇలాంటి ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే.గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఒక పార్టీ గుర్తు మీద పోటీ చేసి శాసనసభ్యులుగా ఎన్నికైన వారికి ఏకంగా మంత్రి పదవులే కట్టబెట్టడం చూశాం.ఇప్పుడు కూడా ఒక పార్టీ ఎన్నికల గుర్తుమీద గెలుపొంది ఇంకోపార్టీ కండువాలు కప్పుకున్న శాసనసభ్యులు 10 మంది ఉన్నారు.

వీరిలో మిగతా వారి విషయంలో పార్టీ మారినట్లుగా ఆధారాలు దొరకలేద ని,వారంతా బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారని స్పీకర్ క్లీన్‌చీట్ ఇచ్చినప్పుడు పెద్దగా ఆశ్చర్య పోలేదు.అయితే బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో స్పీకర్ తీర్పు విస్మయానికి గురిచే స్తోంది.వారు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని చెప్పడం వింతగానే ఉంది.ఎందుకంటే ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలు పొందిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ బీఫామ్ తీసుకుని చేతిగుర్తుమీద పోటీ చేసిన విష యం అందరికీ తెల్సిందే.వందేళ్లపైబడి చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీలో ఒక ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థే కరువై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మె ల్యేగా గెలుపొందిన దానం నాగేందర్‌కి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందనుకోవడం అమాయకత్వమే అవుతుంది.పైగా రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు ఒక ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి అభ్యర్థి దొరకకపోవడంతో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకి కాంగ్రెస్ బీఫామ్ ఇచ్చి బలవంతంగా పోటీలో నిలిపినట్లుగా అనుకోవాల్సి ఉంటుంది.ఎవరు ఏమి అనుకున్నా అనుకోకపోయినా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ మీదనే పోటీ చేశారు.కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయమని బహిరంగంగా ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు.కాంగ్రెస్ ముఖ్యమంత్రి,కాంగ్రెస్ అగ్రనేతల చేతిమీదుగా కాంగ్రెస్ కండువాలు కప్పించుకున్నారు.కాంగ్రెస్ సభల్లో పాల్గొన్నారు.ఇదంతా వందకు నూటయాభైశాతం బహిరంగంగా జరిగిన నిజం.ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలో ఆ దేవుడికే తెలియాలి. ఇక స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనుంచి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.అనంతరం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా తన కూతురు కడియం కావ్యకు కాంగ్రెస్ టికెట్ వచ్చిన సందర్భంలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం భహిరంగంగా కాంగ్రెస్ ప్రచార సభల్లో ముఖ్యమంత్రితో పాల్గొన్నారు.కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు.కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేయమని బహిరంగంగా అభ్యర్థించారు.ఇప్పటికీ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నారు.ఒక పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ప్రజా ప్రతినిధి ఇంకో పార్టీ అభ్యర్థికి ఓట్లువేయమని అభ్యర్థించడం..పక్క పార్టీ సమావేశాల్లో పాల్గొనడం పార్టీ ఫిరాయింపుల కిందకు రాదని చెప్పే సాక్ష్యంగా నిలవకపోవడం విడ్డూరమే. న్యాయస్థానంలో ఓ నిందితుడికి శిక్ష పడాలంటే అన్నింటికన్నా ముఖ్యం సాక్ష్యం.నమ్మదగిన సాక్ష్యాలుంటే సంబంధిత నిందితుడికి శిక్షపడుతుంది.మరి దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో వారు పార్టీ మారినట్లు బలమైన సాక్ష్యాలున్నా అవి ఫిరాయింపులు జరిగినట్లుగా నిరూపించే సాక్ష్యాలుగా నిలవకపోవడం విచారకరం.ఓ పార్టీ ఎన్నికల గుర్తు మీద పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన అభ్యర్థి మరో పార్టీ ఎన్నికల గుర్తు మీద ఇంకో ఎన్నికల్లో పోటీ చేస్తే దాన్ని ఫిరాయింపు అనక మరేం అంటారో అర్థం కావడం లేదు. మొత్తం మీద కారు గుర్తు మీద పోటీ చేసి గెలుపొందిన 10 మంది శాసనసభ్యులు తాము ఇంకా కారు దిగలేదు..పార్టీ మారలేదని ఇచ్చిన వాంగ్మూలాలను స్పీకర్ విశ్వసించి వారు పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేని కారణంగా వారికి క్లీన్‌చీట్ ఇవ్వడంతో సదరు ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నట్లయింది.ఇరకాటం నుంచి కాంగ్రెస్ సర్కార్ బయటపడినట్లయింది.ఒకవేళ దానం,కడియంల విషయంలో స్పీకర్ అనర్హత వేటు వేసి ఉన్న పక్షంలో అది రేవంత్ సర్కార్‌కి ఇబ్బందికరంగా ఉండేది.కానీ ఆ గండం తప్పినట్లయింది.ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే పక్షంలో రాష్ట్రంలో మళ్ళీ ఉప ఎన్నికలు వచ్చి ఉండేవి.అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేపక్షంలో తమ పాత పార్టీకి,శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికల బరిలో నిలిచి ఉండి ఉంటే గెలుపోటముల సంగతి తర్వాత కనీసం నైతికత అనేదన్నా మిగిలేది.మొదట్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్ళీ అధికార పార్టీ గుర్తు మీద ఎన్నికలను ఎదుర్కొని పార్టీ మారిన వారిని గెలిపించుకోవాలనే ఉత్సాహాన్ని అధికార కాంగ్రెస్ నేతలు చూపించారు.రానురాను పరిస్థితులు మారి మళ్ళీ ఎన్నికల గోదాలోకి దిగడం శ్రేయస్కరం కాదని వెనకడుగు వేశారు. ఫిరాయింపుల కత్తిని సరియైన సాక్ష్యాలు లేవనే కారణంతో స్పీకర్ తిరస్కరించడం రేవంత్ సర్కార్‌కు ఊరటనిచ్చే అంశమే కావచ్చు..కానీ ప్రజల్లో మాత్రం పలచనవుతున్న విషయం కాదనలేం. గతంలో ఫిరాయింపులు జరగలేదా? ఇప్పుడే జరిగాయా? అనే ఎదురుదాడి చేసి మీడియాల ముందు పెద్ద గొంతులు వేసుకుని అరవచ్చు..అయితే సాక్ష్యాలు..టెక్నికల్ విషయాలతో ఫిరాయింపుల విషయంలో నెగ్గుకువచ్చినా ప్రజలు మాత్రం ఇది అనైతికం అని బలంగా నమ్ముతున్నారు.కావల్సినంత బలం ఉన్నా ఇతర పార్టీల నుంచి శాసనసభ్యులను ఫిరాయించేలా రాజకీయాలు చేయడం ఎన్నటికీ శ్రేయస్కరం కాదు. మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని ప్రజల పక్షాన పోరాడుతున్న నేతలకు ఫిరాయింపు నేతలో ప్రాధాన్యం తగ్గి వారు అవమానాలకు గురై పార్టీలో లులలుకలు మొదలవుతాయి.ఇదే విషయం ఇప్పుడు జగిత్యాల వంటి నియోజకవర్గాల్లో చూస్తున్నాం.ఫిరాయింపుదార్లు భవిష్యత్ ఇప్పుడు బాగున్నా వచ్చే ఎన్నికల్లో ప్రజల్లో పరాభవం తప్పదు. దేశరాజకీయాల్లో ఫిరాయింపుదార్లకు అనేక సార్లు గుణపాఠం ఎదురైన చరిత్రలను మరవలేం. ఇప్పుడు తెలంగాణలో కూడా ఫిరాయింపుదార్లకే పట్టం అనే విషయం అనేకసార్లు నిరూపితమవుతుండటం నిఖార్సయిన కాంగ్రెస్ వాదులను,నేతలను ఇబ్బందిపెడుతోంది. అసంతృప్తితో రగిలే చేస్తోంది.ఈ పరిణామాన్ని అంత తేలిగ్గా తీసుకోలేం.వచ్చే ఎన్నికల్లో తప్పక ప్రభావం చూపెడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

....................

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**

..........................

# దానం,కడియంలు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే

- వారిద్దరు పార్టీ మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవు
- దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్





## » ఇప్పటివరకూ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చారు. వారిద్దరూ పార్టీ మారినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు వారి అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేశారు. వారిద్దరూ పార్టీ మారలేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తుది తీర్పు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి క్లీన్‌చీట్ వచ్చింది.

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోకపోవడంతో ఈ విషయం సుప్రీంకోర్టు దాకా వెళ్లిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బీ కృష్ణమోహన్‌రెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, ఎం సంజయ్‌కుమార్, జీ మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీల వ్యవహారంపై విడతల వారీగా స్పీకర్ విచారణ జరిపారు. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వగా.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిటిషన్లపై నాలుగు రోజుల క్రితం విచారణ పూర్తి చేశారు. అనంతరం తీర్పును నేటికి రిజర్వ్ చేశారు. తాజాగా తీర్పును ప్రకటించారు.

### దానం నాగేందర్ ఏమన్నారంటే..

స్పీకర్ తనపై అనర్హత వేటు వేసినా పోరాటం ఆపనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎంపీగా పోటీ చేయడం తన వ్యక్తిగత విషయమని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఏరోజు పనిచేయలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనకు ఎప్పుడూ విప్ ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ పరిధిలో తాను ఎక్కడా పొరపాటు చేయలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నా : కడియం శ్రీహరి

అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వాగతించారు. బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు తనకు మాత్రమే వర్తింస్తాయా? కేసీఆర్‌కు వర్తించవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తన హయాంలో జరిగిన ఫిరాయింపులకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 'కేసీఆర్ క్షమాపణ చెప్పితే నేను రాజీనామాకు సిద్ధం' అని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కేసీఆర్ మంత్రులుగా చేయలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ శాసనసభా పక్షం బీఆర్ఎస్‌లో విలీనం కాకముందే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రిని చేశారని, ఇది నైతికమా? అని సవాల్ విసిరారు. రాజకీయంగా తమను ఎదగకుండా చేయడానికే కేసీఆర్ జిల్లాల విభజన చేశారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఎంతో చరిత్ర ఉన్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని సిద్ధాంతపరంగా విభేదించానని ఎమ్మెల్యే అన్నారు. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇవ్వడానికే తన స్థానంలో సబితను విద్యా శాఖ మంత్రిని చేశారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తాను వ్యతిరేకమని.. అన్ని విషయాలు త్వరలోనే బయటపెడతానని హెచ్చరించారు. ప్రస్తుతం తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో తనకు సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎదుర్కొంటానని.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు.

### రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి.. స్పీకర్ నిర్ణయంపై కేటీఆర్ ఆగ్రహం

బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచిన దానం నాగేందర్ ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌తో ఎంపీగా పోటీచేశాడని, అతడిపై అనర్హత వేటు వేయడానికి అంతకంటే సాక్ష్యం ఏం కావాలని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. భారతదేశ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంతగా ఇంత అద్భుతమైన నిర్ణయం తీసుకున్నందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సన్మానం చేయాలని ఆయన ఎద్దేవా చేశారు. అద్భుతమైన నిర్ణయం తీసుకున్నందుకు రాహుల్ గాంధీకి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాము సన్మానం చేద్దాం అనుకుంటున్నామని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగం మీద రాహుల్ గాంధీ చేస్తున్న బహిరంగ దాడి ఇదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్‌గాంధీకి సిగ్గు, లజ్జ ఉంటే పార్టీ ఫిరాయింపులపై సమాధానం చెప్పాలి. పార్టీ మారిన వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలని రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు రాళ్లతో ఎవరిని కొట్టి చంపాలని ప్రశ్నించారు.